తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో హైకోర్టు రిటైర్డు జడ్జి చంద్రకుమార్



సమావేశంలో అభివాదం చేస్తున్న హైకోర్టు రిటైర్డు జడ్జి చంద్రకుమార్, తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఉద్యమకారుల కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తి వేసి వారికి తగిన ప్రాధాన్యత కల్పించాలని హైకోర్టు రిటైర్డు జడ్జి చంద్రకుమార్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరుతాయని అనుకున్నామని కానీ కేసీఆర్ అందుకు భిన్నంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కేసులు ఎత్తివేయకపోగా ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు యత్నించారని, అంతేగాకుండా ప్రజా ఉద్యమకారులపై పౌర హక్కుల సంఘం నేతలపై కూడా అనేక కేసులు పెట్టారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఉత్సవాలు చేయడం సంతోషకరమని, అయితే రాష్ట్ర కల సాకారానికి కారణమైన ఉద్యమకారుల త్యాగాన్ని గుర్తించి కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక కన్వీనర్ జి.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, కోకన్వీనర్లు కృష్ణలత, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సోగరబేగం, బీఎస్ రాములు, పృథ్వీరాజ్, సిద్ధులు, కోల జనార్దన్, సూర్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్తీలో ప్రైవేట్ పాఠశాల వద్దు

స్కూల్ ఎదుట నిరసన తెలిపిన స్థానికులు



స్కూల్ ఎదుట నిరసన తెలుపుతున్న బస్తీ అసోసియేషన్ ప్రతినిధులు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ స్ట్రీట్ నంబర్ 15లో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నారని గురువారం పాఠశాల భవనం ఎదుట తిలక్‌నగర్ యంగ్‌మెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్. ప్రసాద్, ప్రతినిధులు జనార్దన్, శివ, శ్రీకాంత్, హరి, రాజమ్మ, రాధిక మహేశ్, సంతోష్, సందీప్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ బస్తీలో 17 ఇండ్లు ఉన్నాయని, ఇప్పటికే ఇక్కడ ఒక ప్రైవేట్ పాఠశాల ఉందన్నారు. అసలే ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు మరో స్కూల్ ఏర్పాటు చేస్తే తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ విషయమై ఇటీవల పలుమార్లు విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. అయినా బస్తీవాసుల అనుమతి లేకుండా పాఠశాల ఏర్పాటుకు అనుమతులు ఎలా ఇస్తారని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. పర్మిషన్‌ను వెంటనే రద్దు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వాణి, రాణి, ధన్ రాజ్, దీపక్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కుల జనగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నల్లా సూర్యప్రకాశ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కుల జనగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీలు ఎన్నికలను లాభసాటి వ్యాపారంగా మార్చాయని విమర్శించారు. ఎన్నికలకు ముందు 60 శాతం ఉన్న బీసీ కులాలపై ఎనలేని ప్రేమను చూపించి గెలిచిన తర్వాత బీసీ కులాలను విస్మరిస్తున్నాయన్నారు. అందుకే బీసీ రిజర్వేషన్లు కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ మాట్లాడుతూ పార్టీలన్నీ అధికారంలోకి వచ్చేందుకు ఆచరన సాధ్యంకానీ హామీలు ఇచ్చి తర్వాత వాటిని అమలు చేయడం లేదన్నారు. కుల జనగణన బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్‌ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, వివిధ పార్టీల నాయకులు కె.పర్వతాలు, నూనె వెంకటస్వామి, రాజేశ్, వనం సుధాకర్, సబ్బని లత, మారో సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



డీబీఎఫ్ సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భారత రాజ్యాంగం ద్వారా ప్రజలకు సమానత్వం, జీవించే హక్కులు లభించాయని అలాంటి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని జస్టిస్ చంద్రకుమార్ పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) నాలుగో మహాసభల సందర్భంగా గురువారం సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అందించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందన్నారు. మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను హత్యలు చేయడం తగదన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగపురి ప్రీతం మాట్లాడుతూ ఆర్థిక అసమానతలను రూపు మాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పార్లమెంట్‌లో జాతీయ విద్యా విధానంపై చర్చించకుండా నూతన విద్యా విధానం తీసుకురావడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, సామాజిక కార్యకర్త కె.సజయ, డీబీఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేశ్, ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, పీఎంసీ కన్వీనర్ శివలింగం తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై దృష్టి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

రాంగోపాల్‌పేట్: నిరుద్యోగ యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు మరింత పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 150 ఏళ్ల క్రితం స్వామి వివేకానంద చికాగో వెళ్లే ముందు ఇదే ప్రాంగణం నుంచి ఆయన సందేశాన్ని ఇచ్చారని ఇలాంటి చోట ఆయన పేరుతో ఏర్పాటైన విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థులు అదృష్టవంతులన్నారు. వివేకానందుడు బోధనలు యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కేవీకే రావు, ఎస్వీఐటీ కార్యదర్శి హర్షా శశాంక్, సభ్యులు హరీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గీతంపై రాద్ధాంతం తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఫోన్ ట్యాపింగ్ కేసును పక్కదారి పట్టించేందుకే జయ జయ హే తెలంగాణ గీతంపై బీఆర్ఎస్ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ కార్య నిర్వాహకులు కోట శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కవి, గాయకుడు అందెశ్రీ రాసి పాడిన తెలంగాణ గీతాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అమరుల స్థూపం, సచివాలయం, యాదగిరి గుట్ట, కాళేశ్వరం ప్రాజెక్టు పనులతో పాటు ఇతర భారీ నిర్మాణాలను ఆంధ్రులతో చేయించి కేవలం తెలంగాణ గీతానికి ఎంఎం కీరవాణి సంగీతం చేపడితే విమర్శించడం సిగ్గుచేటన్నారు. సతీష్, వెంకట్ నాయక్, పవన్, జశ్వంత్, బాలకృష్ణ, వెంకటరమణ, రాము, వినయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆటోవాలాల ఆగడాలు..!

- అంబర్‌పేటలో సెవెన్ సీటర్స్ ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యం
- రోడ్లపైన ఇష్టారాజ్యంగా నిలుపుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ముందు ఆపిన సెవెన్ సీటర్ ఆటో

అంబర్‌పేట: అంబర్‌పేటలో సెవన్ సీటర్స్ ఆటోవాలాల ఆగడాలు రోజురోజుకు శ్రుతిమించుతున్నాయి. వీరి ఆగడాలతో ప్రయాణికులు బెంబెలెత్తిపోతున్నారు. ఉప్పల్ చౌరస్తా నుంచి అంబర్‌పేటకు, దిల్‌షుక్‌నగర్ నుంచి అంబర్‌పేటకు నిత్యం పెద్ద సంఖ్యలో సెవెన్ సీటర్స్ ఆటోలు ప్రయాణికులను చేరేవేస్తుంటాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని అతివేగంతో నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పట్టించుకోవాల్సిన ట్రాఫిక్, పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ప్రశ్నిస్తే దౌర్జన్యమే..

సెవెన్ సీటర్ ఆటోవాలాలు రోడ్లపై కనీస నిబంధనలు పాటించకుండా రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. రాంగ్ రూట్‌లో వస్తూ ట్రాఫిక్ నిబంధనలును ఉల్లంఘిస్తున్నారు. రోడ్డుపై వీరి ఆటోకు ముందు వెనుక ఎవరు ఉండద్దు అన్న స్థాయిలో నడుపుతూ ఇష్టానుసారంగా వెళ్తూ ఇతర వాహనదారులను బెంబెలెతిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు సైతం దిగుతున్నారు. అంతేగాకుండా ప్రయాణికులకు ఇచ్చే చిల్లర డబ్బులు సైతం ఇవ్వడంలేదు. గట్టిగా డబ్బులు అడిగితే ఘర్షణకు దిగి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితులు ఎవరికీ చెప్పుకోవాలో అర్థం కానీ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వినాయక నగర్ చౌరస్తాలో నడిరోడ్డుపై ఆగిన ఆటో

స్పెషల్ డ్రైవ్ చేపట్టి చర్యలు తీసుకుంటాం..

సెవెన్ సీటర్స్ ఆటోవాలాల ఆగడాలను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతాం. నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– లెనిన్ బాబు, అంబర్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈ నెల 31న (నేడు) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రివెంటివ్ మెడిసిన్ ఫీడర్ పరిధిలో గౌరమ్మ గల్లి, రాజీవ్‌గాంధీనగర్ కమ్యూనిటీహాల్, సాయిబాబా కమాన్, సుందరయ్య పార్కు, టీఆర్‌టీ క్వార్టర్స్, రెడ్డి ఆయిల్ మిల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు, లేపాక్షి ఫీడర్ పరిధిలో కపాడియా డయాగ్నోస్టిక్ సెంటర్, గోల్కొండ సిగరేట్ ఫ్యాక్టరీ, రాజా ఫర్నీచర్, లేపాక్షి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు, రాంనగర్ ఫీడర్ పరిధిలో రాంనగర్, టీఆర్‌టీ క్వార్టర్స్, రెడ్డి ఆయిల్ మిల్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ఆప్కో ఫీడర్ పరిధిలోని నారాయణగూడ వాటర్ వర్క్స్, కెనరా బ్యాంక్, శాంతి థియేటర్, తెలంగాణ టూరిజం, విఠల్‌వాడి, తెలుగు అకాడమీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 వరకు, గాంధీ కుటీర్ ఫీడర్ పరిధిలో గాంధీ కుటీర్, శివాలయం టెంపుల్, నారాయణ కాలేజ్, ఎయిర్ బస్, హిమాయత్‌నగర్ పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం



మంత్రి శ్రీధర్‌బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న కెనడీ రాజుకృపారావు, నేతలు

చిక్కడపల్లి: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నేత కెనడీ రాజు కృపారావు అన్నారు. గురువారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదినం సందర్భంగా పలువురు పార్టీ నేతలతో కలిసి మంత్రిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం ఆయన గాంధీనగర్‌లో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు అభిషేక్ కెనడీ తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తికి జైలు



మహ్మద్ సలీమ్

చిలకలగూడ: మహిళను వేధించడంతో పాటు పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, అడ్మిన్ ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన మహ్మద్ సలీమ్ (39) ఈ నెల 22న ఓ మహిళకు ఫోన్ చేసి వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సలీమ్‌ను అదుపులోకి తీసుకుంటుండగా పోలీసులపై తిరగబడి విధులకు ఆటంకం కలిగించాడు. సీపీ యాక్ట్ ప్రకారం ఈ–పెటీ కేసులు నమోదు చేసి గురువారం సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి రవిశంకర్ ఎదుట హాజరు పర్చగా ఏడు రోజులు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

రెడ్ కలర్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ తెరవద్దు



డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతకు ఎరుపు రంగు వేస్తున్న జలమండలి సిబ్బంది

ముషీరాబాద్: రెడ్ కలర్ ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ మూతలను ఎట్టి పరిస్థితిల్లోనూ తెరవద్దని చిలకలగూడ జలమండలి రిజర్వాయర్ డీజీఎం మోహన్‌రాజ్ పేర్కొన్నారు. రిజర్వాయర్ పరిధిలోని మూడు సెక్షన్లలో అతి లోతు గల మ్యాన్‌హోల్ మూతలకు జలమండలి సిబ్బంది గురువారం ఎరుపు రంగు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ పరిధిలో 172 అధికలోతు గల డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను గుర్తించి ముందు జాగ్రత్త చర్యగా వాటికి ఎరుపు రంగు వేస్తున్నామన్నారు. అలాగే మ్యాన్‌హోల్ కింద భాగంలో ప్రత్యేక జాలిని కూడా పెట్టామని తెలిపారు. వర్షాకాలంలో ఎట్టి పరిస్థితిల్లోనూ వరద పోయేందుకు రెడ్ కలర్ వేసిన మ్యాన్‌హోల్స్‌ను తెరవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సెక్షన్ మేనేజర్ సురేశ్, డ్రైనేజీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు



చెట్ల కొమ్మల తొలగింపు పనులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి, పూస గోరక్‌నాథ్

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలకు అనుకుని ఉన్న చెట్ల కొమ్మలను ఉద్యానవన శాఖ అధికారులు గురువారం తొలగించారు. ఈ పనులను డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరఖ్‌నాథ్‌ల పర్యవేక్షించారు. ప్రమాదంగా ఉన్న చెట్ల కొమ్మల విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సంబంధిత శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. దీంతో స్పందించిన అధికారులు వెంటనే డివిజన్‌లోని ఈస్ట్ ఎంసీహెచ్ కాలనీ, గంగపుత్ర కాలనీ, పార్శిగుట్ట ప్రాంతాల్లో ఉద్యానవన శాఖ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బీఎం శ్రీనివాస్, సునీల్, మోహన్, శర్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



81 కలశాలతో నిర్వహించిన ఘటాభిషేకం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. గురువారం స్వామి వారి డోలోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్–కీర్తి దంపతులు, ఈవో కె.రామాంజనేయుల సమక్షంలో విష్వక్సేన పూజ, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, మహానివేదన, మంత్రపుష్పం వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఘటాభిషేక కార్యక్రమం 81 కలశాలతో జరిగింది. అభిషేకం చేయించుకున్న వారికి స్వామి వారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇచ్చారు. మహానివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం పూర్తయిన అనంతరం స్వామి వారి డోలోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న వేదపండితులు, అర్చకస్వాములను సన్మానించారు.

ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న ఈవో, ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

చిక్కడపల్లి: నగరంలోని ప్రసిద్ధి గాంచిన వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ హుండీని ఆలయ ఈవో మాచర్ల దేవనాథ, ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో గురువారం లెక్కించారు. 70 రోజులకు గాను రూ.2,92,091 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో అర్చకులు కందాళ వెంకటాద్రి, కె.కృష్ణమూర్తి, ఎస్‌బీవీఎస్ ఆచారి, వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు హనుమాన్ జయంతి..

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో ఎం.దేవనాథం తెలిపారు. ఆంజనేయ స్వామి వారికి సిందూరాభిషేకం, ఆకుపూజ, వడమాలపూజ చేస్తామని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు ఉచిత మధుమేహ పరీక్షలు

చిక్కడపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హెల్త్‌సిటీ, తులిప్ డయగ్నోస్టిక్స్ సంయుక్తంగా చిక్కడపల్లిలోని శ్రీ సాయి జయగ్నోస్టిక్ సెంటర్‌లో ఈ నెల 31న (నేడు) ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు లయన్ జీకే రమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందని మధుమేహం ఎక్కువగా ఉన్నవారు హెచ్‌బీ–1సీ 3 నెలల రక్తంలో షుగర్ లెవల్స్ ఎలా ఉన్నాయో పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. నీరసం, అధిక దాహం, చూపు మందగించడం, బరువు తగ్గడం, ఆకలి ఎక్కువగా ఉండడం, తరచూ మూత్ర విసర్జన ఈ లక్షణాలు ఉంటే తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040–27607687 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



సెమినార్‌లో మాట్లాడుతున్న వెంకటేశ్

ముషీరాబాద్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ నగర కార్యాలయంలో నగర అధ్యక్షుడు జె.కుమారస్వామి గురువారం జెండాను ఎగురవేశారు. అనంతరం సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 'సరళీకృత ఆర్థిక విధానాలు–సవాళ్లు–కార్మిక వర్గ కర్తవ్యం' అనే అంశం మీద సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ హాజరై మాట్లాడూతూ గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం అవలంభించిన విధానాల వల్ల దేశంలో సంపద మొత్తం ఒక శాతంగా ఉన్న పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిందన్నారు. దేశంలో 50 కోట్ల మంది కార్మికులు పని చేస్తుండగా వారి నిజవేతనాలు పడిపోయాయన్నారు. ధరలు పెరిగాయి, ఉద్యోగులు ఊడిపోయాయి, ఇదంతా మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాల ఫలితమే అని మండిపడ్డారు. అంతేగాకుండా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ శక్తుల చేతుల్లోకి పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వెంకటేశ్, నగర అధ్యక్షుడు జె.కుమారస్వామి, శ్రామిక మహిళా నగర కన్వీనర్ బి.కిరణ్మయి, నగర కోశాధికారి కె.అజయ్‌బాబు, నగర ఉపాధ్యక్షుడు జి.రాములు, నగర సహాయ కార్యదర్శి యాదమ్మ పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ డివిజన్ కార్యదర్శి మృతి



ప్రసాద్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, వై.శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కార్యదర్శి ఏర్పుల ప్రసాద్ (34) గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం రాత్రి భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లోని తన నివాసంలో ఉండగా ఛాతిలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు వెంటనే బైక్‌పై ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రసాద్ మృతి పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ప్రసాద్ అంత్యక్రియలు గురువారం సాయంత్రం స్థానిక శ్మశానవాటికలో నిర్వహించారు.

పట్టుదల క్రమశిక్షణతోనే సివిల్స్‌లో విజయం



ఆఫ్‌లైన్ తరగతులను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి, సివిల్స్ ర్యాంకర్ అయుషి ప్రధాన్, ఐఏఎస్ శరత్, వసంతరెడ్డి

చిక్కడపల్లి: సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధించవచ్చని సివిల్స్ 36వ ర్యాంకర్ అయుషి ప్రధాన్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ఐదేళ్ల నుంచి నిర్వహిస్తున్న ఆన్‌లైన్ నుంచి ఆఫ్‌లైన్ క్లాసుల ప్రారంభ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త అనుమల తిరుపతిరెడ్డి, ర్యాంకర్ అయుషి ప్రధాన్, ఐఏఎస్ అధికారి శరత్, తెలంగాణ రాష్ట్ర రెడ్డి జేఏసీ మహిళా అధ్యక్షురాలు వసంతరెడ్డి తదితరులతో కలిసి హాజరై గురువారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఉషాశ్రీ, శ్యామ్ రాథోడ్ మాట్లాడుతూ ఇటీవల వచ్చిన సివిల్స్ ఫలితాల్లో తమ అకాడమీకి 8 ర్యాంకులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సీతారామం రాథోడ్, ఫ్యాకల్టీలు రమేశ్ ఎకనామి, రేవా హిస్టరీ, విలాస్ రాథోడ్ జాగ్రఫీ, సురేంద్ర సీ–శాట్ తదితరులు పాల్గొన్నారు.

'కులవివక్ష మానవత్వానికి మచ్చే'



రికార్డు యోగ్యతాపత్రాన్ని పుష్పలతకు అందజేస్తున్న వెంకటాచారి, ఎస్పీ భారతి, శివ, తదితరులు

చిక్కడపల్లి: శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకెళ్తున్న నేటి తరుణంలోనూ కులవివక్ష కొనసాగుతుండడం మానవత్వానికి మచ్చ లాంటిది అని ప్రముఖ నాట్యగురువు, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతి పేర్కొన్నారు. ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ కళానిలయం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని 133 మంది కళాకారులతో గురువారం రాత్రి నాట్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమం తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించినట్లు సంస్థ స్థాపకుడు చింతపట్ల వెంకటాచారి తెలిపారు. రికార్డు యోగ్యతాపత్రాన్ని నిర్వహణ సంస్థ అధ్యక్షురాలు పుష్పలతకు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖులు శివ, దైవజ్ఞశర్మ, ఎంవీ రావు, మురళీధర్, నాగతేజ, రాజేందర్, సురేందర్ పాల్గొన్నారు.

ఓయూలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జూన్ 2న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఓయూ విద్యార్థి జేఏసీ కన్వీనర్ తల్లమల్ల శ్వేతహసేన్ గురువారం తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లైన సందర్భంగా తెలంగాణ కోసం పోరాడిన విద్యార్థి జేఏసీ నేతలతో జూన్ 2న ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కాలేజీ ఎదుట మొదటి దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యమగడ్డ ఉస్మానియా వేదికగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన విద్యార్థి నేతల ఉద్యమ జ్ఞాపకాలను స్మరిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.